# సమయానికి తగు మాటలాడెనే...

బస్సు ఎక్కి కూర్చున్నాను. వారపత్రికలో అత్యంత సస్పెన్స్‌తో నడుస్తున్న సీరియల్ తీశాను. నిజానికి పత్రిక నా చేతికి వచ్చాక అది చదవకుండా ఒక్క క్షణం కూడా వుండలేకపోతున్నాను— విజయవాడలో కాపురం, గుంటూరులో ఉద్యోగం కనుక నాకిది దినచర్యే.

ఇంతలో ఎవరో మగాళ్ళు వచ్చి నా పక్కన కూర్చునేసరికి వులిక్కిపడి పక్కకి తిరిగి చూశాను. ఆమె లేడీ పోలీస్. ఆశ్చర్యంగా ఆమెవైపు చూస్తూ వుండిపోయాను. నిక్కబొడుచుకున్నట్లు బిరుసుగా వున్న కాకీడ్రస్‌లో వుంది. చామన చాయగా, అయిదున్నర అడుగు లుండేమో మంచి ఎత్తరిగా ఆరోగ్యంగా వుంది. జుట్టు జడలు అల్లి పైకి కట్టేసి టోపీ పెట్టేసింది. చిన్న తిలకం బొట్టు—ముక్కు పుడక— చెవులకి నక్షత్రాలు. ఆమె రూపం చూస్తే ఓలే విచిత్రంగా అనిపించింది. ఆమె జేబులోంచి పోలీసు వారెంటుతీసి కండక్టరు కిచ్చింది. ఆమె అలా మగాడిలా, ఆ డ్రస్‌లో హాయిగా, స్వేచ్ఛగా వుండటం చూస్తే నాకెంతో ముచ్చటేసింది.

బస్సు డోర్ డామ్మని మూసి "రైట్" అన్నాడు కండక్టరు. బస్సు కదలడమే వేగాన్ని పుంజుకుంది.

నేను నా అభిమాన రచయిత సీరియల్ చదవడం మొదలుపెట్టాను. అది చదువుతుంటే నేనున్న 'బస్సు కూడా ఎవరైనా ఆపి, తుపాకులతో బెదిరించి, నన్ను మాత్రం కిడ్‌నాప్‌చేసి తీసుకుపోతారేమోనని భయం వేస్తోంది.

నా పక్కన కూర్చున్న లేడీ పోలీసు తన కాలుమీద నెమ్మదిగా తాళం వేసుకుంటూ పాట మొదలుపెట్టింది. ఈసారి నా ఆశ్చర్యం రెండింతలైంది. ఆమె కేవలం ఉత్సాహంతో మాత్రమే పాడటంలేదు. చక్కని కంఠంతో, సంప్రదాయ సిద్ధంగా పాడుతోంది. నేను ఆమెవైపు చూడకుండా చెవి మాత్రం అటు పెట్టేశాను.

రామభక్తి సామ్రాజ్య మే మానవుల
కబ్బునో మనసా !

ఆమె ఒక్కొక్క సంగతీ రెండేసిసార్లు వేసుకుని దాదాపు ఇంటి దగ్గర దీక్షగా సాధన చేస్తున్నట్లు చేస్తోంది. బస్సు హోరు ఎక్కువగా వుండటంవల్ల ఎవ్వరూ పట్టించుకున్నట్లు లేదు.

ఇలాగని వివరించలేను
చాలా స్వానుభవ వేద్యమే
లీలా సృష్టి జగత్త్రయమనే
కోలాహల త్యాగరాజ వినుతమా....

నేను పూర్తిగా ఆమెవైపు తిరిగిపోయాను. ఆమె నావైపు చూసి, కొంచెం తొట్రుపడింది. చిన్నగా నవ్వి " మీకు యిబ్బందిగా వుందా ? " అంది.

నాకు భలే చిన్నతనంగా అనిపించింది.

" త్యాగరాజ కృతిని ఇబ్బందిగా ఫీలయ్యేవాళ్ళేం తెలుగువాళ్ళ మండీ ? " అన్నాను. ఆమె నా మాటలకి బాగా ఉత్సాహం పుంజుకున్నట్లుంది.

" నాకు సంగీతమంటే చాలా యిష్టం " అంది. నేను అడగబోయే ప్రశ్నకి ముందే జవాబు చెప్తున్నట్లు.

" ఊరికే యిష్టమే కాదు. మీ కంఠం చాలా బాగుంది. ఎక్కడ నేర్చుకుంటున్నారు " అన్నాను.

ఆమె నిట్టూర్చింది. నేను ఊరుకోలేక, " అవునూ మీకున్న ఉద్యోగానికీ మీ అభిరుచికీ...."

" అవును అస్సలు కుదరదు. కాని ఏం చేస్తాం చెప్పండి. నా చిన్నప్పుడే మా నాన్న పోయాడు. నేనూ, మా అమ్మా మావయ్య దగ్గరే వున్నాం. మా మావయ్య పోలీసు. ఆయనకి పోలీసైనవాళ్ళు మాత్రమే మనుషులని మిగిలినవాళ్ళు పురుగులని దృఢమైన అభిప్రాయం. అందుకని నా టెన్త్‌క్లాసు పూర్తవగానే నన్నీ ట్రైనింగ్‌కి పంపించి, ఉద్యోగం కూడా వేయించారు. పాపం. మా అమ్మ ఎంతో బాధపడుతుంది. నిజంగా మీరు మా అమ్మ పాట విన్నారంటే మూర్ఛపోతారు. అసలు ఆమెకున్న గాత్రంలో పదోవంతు కూడా నాకు రాలేదు. నాకు సంగీతం చెప్పించాలని అమ్మ ఎంతో తాపత్రయ పడింది. నోరెత్తితే తంతా నన్నాడు మా మావయ్య. అయనకి పోలీసు వుద్యోగమంటే ఎంత గొప్పో, కళాకారు లంటే అంత చులకన. అందుకే నేను చచ్చినట్టు నోరుమూసుకుని పడివున్నాను. "

" మరి మీకీ కీర్తనలన్నీ ఎలా వచ్చాయి ? " అన్నాను ఆశ్చర్యంగా.

నేను ఉద్యోగంలో చేరాక, ఓ సంగీతం మాష్టారు దగ్గర మొదలు పెట్టాను. ఆయన చాలా బాగా చెప్తారు. రెండేళ్ళనుంచి బాగా కుదిరింది. ఆర్నెల్ల క్రితం మావయ్యకి తెలిసింది. ఎందుకో మరి ఏమీలేదు. అదే చాలనుకున్నాను. నాకు యింటిదగ్గర పాడేందుకు కుదరదు. అందుకే యిలాంటి ప్రయాణంలో పాడేసుకుంటూ వుంటా. ఆమె గలగలా మాట్లాడేస్తుంటే నాలో దిల్‌రుబా మీటినట్లనిపించింది. " నిజంగా ఏ హృదయంలో ఏ కళ ఉప్పొంగిపోతూ వుంటుందో చెప్పలేము కదా " అనుకున్నాను. " ఇప్పుడెక్కడికి వెళ్తున్నారు ? "

" గుంటూరులో ఛీఫ్ మినిష్టరుగారి ప్రోగ్రాము వుంది. అక్కడకి స్పెషల్ డ్యూటీకి వెళ్తున్నాను " అంది.

ఆమె మాట మధ్యలో....

సా సా సా సని నిస నినిసనిసా....

మపనిసరి రీ రీ గరిరి గరిరి

గరిరి గరిరి సా....

గరిరిసాని—ఎందరో మహానుభావులు అంటోంది. నేను వింటూ కూర్చున్నా. స్వరం, సాహిత్యం పూర్తిగా పాడేసుకుంది. మధ్యలో తన ఎడ్రసు నా కిచ్చింది.

" మీకు సంగీతం వచ్చా " అంది. వచ్చునని తలూపాను.

" నేను పరీక్షకి కడదామనుకుంటున్నాను " అంది.

" తప్పకుండా కట్టండి. మీకు చక్కని శ్రుతి, లయ కంఠం వున్నాయి " అన్నాను.

ఇంతలో బస్సు గుంటూరు సమీపించింది. ఆమె రైలు గేటు యివతలే బస్సు ఆపించి దిగిపోయింది.

దిగిపోతూ —

హరే రామచంద్ర యదుకులేశ

మృదు సుభాష శేషశయన, పరనారీ

సోదర రాజ విరాజ తురగరాజ

రాజనుత నిరామయా పసనీరుహ

దళాక్షయనుచు వేడుకొన్న

నన్ను తా బ్రోవకనే—సమయానికి తగు మాటలాడెనే....

అని కళ్ళతోనే వీడ్కోలు చెప్పింది. నే నాశ్చర్యంలో వుండిపోయాను.